ప్రజాశక్తి
బుధవారం 13 సెప్టెంబర్ 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

వర్షాభావం, సాగునీటి కొరత నేపథ్యంలో

వాణిజ్య పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

నీటిపారుదల సలహామండలి సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు సూచన

ప్రజాశక్తి-విజయవాడ : వర్షాభావ పరిస్థితులు, జలాశయాలలో తక్కువ నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలు సాగు చేసుకునేలా రైతులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక నీటి పారుదల సర్కిల్ కార్యాలయంలోని రైతు శిక్షణ కేంద్రంలో మంగళవారం మూడవ నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, తక్కువ వర్షపాతం నమోదుకావడంతో శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులలో తక్కువ నీటి నిల్వలు ఉన్నాయన్నారు. అదే సమయంలో ఆగష్టు, సెప్టెంబర్లలో జోన్-2, నవంబర్లో జోన్-3 పరిధిలోని మండలాలకు సాగునీటి సరఫరా జరిగే పరిస్థితులు కనిపించడంలేదన్నారు. ఈఏడాది ఖరీఫ్‌లో లక్ష ఎకరాలలో వరి, 75 వేల ఎకరాలలో పత్తి, 45 వేల ఎకరాలలో మిరప, 10 వేల ఎకరాలలో మొక్కజొన్న పంటలను రైతులు సాగుజేస్తున్నారన్నారు. ప్రస్తుత పంటలు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్టోబర్, నవంబర్, డిసెంబర్లలో 45 నుండి 50 రోజులలో పంట చేతికి వచ్చే మినుము, కంది, పెసర, శనగలు, ఉలవలు, నువ్వులు వంటి ఆరు తడి పంటలను వేసుకునేలా రైతులకు వివరించాలని కోరారు. మండల, గ్రామ స్థాయిలో

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో ఎంఎల్ఎ విష్ణు

వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారులు వాస్తవ పరిస్థితులను వివరించి, రైతులకు అవగాహన కల్పించే విధంగా సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు వర్దన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో జలాశయాలలో నీటి నిల్వలు ఆశాజనకంగా లేవన్నారు. ప్రస్తుత పరిస్థితులను అంచనా వేస్తూ రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని సమావేశంలో రైతులు, రైతు సంఘ నాయకులు అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. రైతు నష్ట పోకూడదని తమ ప్రభుత్వం ప్రతి సంవత్సరం ముందుగానే సాగునీటిని విడుదల చేస్తోందన్నారు. శాసన మండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇరిగేషన్, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి విత్తనం నుండి పంట కొనుగోలు వరకు అన్ని స్థాయిలోను రైతులకు అండగా ఉంటున్నారన్నారు. ఇటీవల తక్కువ వర్షపాతాలను, జలాశయాలలోని నీటి లభ్యత నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటి సరఫరా తదితర (మిగతా 6లో)

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

నిర్వహణలో విఎంసి విఫలం
చిన్నవర్షానికే చెరువులను తలపిస్తున్న రోడ్లు
ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుపోతున్న కాల్వలు
దుర్వాసన, దోమలతో అల్లాడుతున్న జనం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చిన్న పాటి వర్షానికే విజయవాడ నగరం జలమయమవుతోంది. రోడ్లపైకి వర్షం నీరు వచ్చి చేరుతుండటంతోపాటు నిల్వ ఉంటుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు దుర్వాసనలతోపాటు దోమల బెడద తప్పడం లేదు. అధిక శాతం ఓపెన్ డ్రెయిన్లు కావడంతో ఈ సమస్యలు షరా మామూలై పోయాయి. నగరంలో అన్నీ కలిపి సుమారు 1237 వరకు డ్రెయిన్లు ఉన్నాయి. ఇవన్నీ ఓపెన్ డ్రెయిన్లు. వీటిల్లో 97 డ్రైన్లు పైకప్పులతో పాటు పక్క గోడలు కూడా లేనివి. నగరంలో ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు ఉన్న ఇళ్లు 1.01 లక్షలు ఉండగా, మరో 1.09 లక్షల ఇళ్లకు భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు లేవు. నగరంలోని డ్రెయిన్లు ప్లాస్టిక్ చెత్తతో నిండిపోవడంతో చినుకులు పడినప్పుడల్లా మురుగు నీరు రోడ్లపైకి రావడానికి ప్రధాన కారణంగా మారుతోంది. కొన్ని ప్రధాన కాల్వలు, ప్లాస్టిక్, పెట్ బాటిళ్లతో నిండిపోతుండటంతో మూసుకుపోతున్నాయి. ఎక్కువ భాగం గాజు సీసాలు, ప్రజలు విసిరిన ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోతున్నాయి. ఇవి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఇంటింటికీ చెత్త సేకరణను అమలు చేస్తున్నప్పటికీ, చెత్తను కాలువల్లో వేయకుండా

నిరోధించలేకపోతున్నారు. గుణదల విద్యుత్ కార్యాలయం పక్కనే ఉన్న సైడ్ డ్రెయిన్, లయోలా కళాశాలకు ఆనుకొని ఉన్న డ్రైన్, సిపిడిసిఎల్ కార్యాలయం ముందున్న డ్రైన్‌తోపాటు నగరంలోని వందలాది మురుగు కాల్వల్లో ఇదే దుస్థితి నెలకొంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుని పోతున్నాయి. ఇదిలా ఉంటే కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను తొలగించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి విఎంసి ఇంజనీరింగ్, సిబ్బందిని విభాగాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయినప్పటికీ ఎక్కడి ప్లాస్టిక్ అక్కడే ఉండిపోతోంది. దీనికి తోడు స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా మారడం కూడా ప్రధాన కారణం. చాలా కాలువలు ముంపు ఛానళ్లకు సరిగ్గా అనుసంధానం చేయలేదు. దీని వల్ల కూడా డ్రైన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. రూ.461 కోట్లతో 424 కిలో మీటర్ల మేర స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ ప్రాజెక్టు చేపట్టారు. ఎల్ అండ్ టి సంస్థ ఈ ప్రాజెక్టును దక్కించుకుంది. నేషనల్ కన్‌సెల్టెన్సీ ఫర్ ప్లానింగ్ అండ్ ఇంజనీరింగ్ (ఎన్‌సిపిఇ) సంస్థ డిపిఆర్‌ను రూపొందించి. రెండు దశాబ్దాల కాలంపాటు నగరంలో కురిసిన వర్షపాతాన్ని ఆధారంగా దీనిని రూపొందించారు. 2016లో పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తి కాలేదు. దీంతో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది.

ఫ్యాకల్టీ ఫుల్... విద్యార్థులు నిల్..!

బందరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి
ప్రశ్నార్థకంగా సొంత భవన నిర్మాణం
అందుబాటులో లేని ఇఇఇ, ఇసి, సిఇసి కోర్సులు
మెకానికల్, సివిల్ కోర్సుల పట్ల విద్యార్థుల అనాసక్తి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

బందరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిరాదరణకు గురవుతోంది. కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించి మౌలిక వసతులు సమకూర్చడంతోపాటు డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ స్టాఫ్ ఉన్నా ఈ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క విద్యార్థి మాత్రమే అడ్మిషన్ తీసుకోవడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. మూడు సంవత్సరాల కోర్సుకు సంబంధించి కేవలం 12 మంది విద్యార్థులు మాత్రమే ఈ కళాశాలలో విద్య నభ్యసిస్తున్నారు.

పాలిటెక్నిక్‌లో ఇఇఇ, ఇసి, సిఇసి కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. అయితే మచిలీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రం విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపని సివిల్, మెకానికల్ కోర్సులను మాత్రమే అందుబాటులో ఉంచారు. సివిల్ 60, మెకానికల్ 60 సీట్లు ఉన్నాయి. అయితే 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మెకానికల్ బ్రాంచిలో మొదటి సంవత్సరం ఒక్క విద్యార్థి మాత్రమే అడ్మిషన్ తీసుకున్నారు. రెండో సంవత్సరం మెకానికల్ బ్రాంచిలో 5, సివిల్ బ్రాంచిలో 3, మూడో సంవత్సరం మెకానికల్‌లో 2, సివిల్‌లో ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్నారు. రెండు బ్రాంచిల్లో మూడు సంవత్సరాల కోర్సులకు సంబంధించి 12 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు.

ఫ్యాకల్టీ ఫుల్

సివిల్ కోర్సుకు ఐదుగురు, మెకానికల్ కోర్సుకు ఐదుగురు, ఇంగ్లీషు, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఇతర జనరల్ సబ్జెక్టు బోధనకు మరో ఐదుగురు చొప్పున మొత్తం 15 మంది లెక్చరర్లు ఉన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఒకరు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఒకరు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో కలిపి మొత్తం 19 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా సొంత భవన నిర్మాణం

కళాశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రయోగాలకు అవసరమైన ల్యాబ్ సౌకర్యం లేదు. సొంత భవన నిర్మాణానికి నాబార్డ్ నుంచి రూ.9 కోట్లు మంజూరయ్యాయి. గోసంఘం వద్ద కళాశాల నూతన భవన నిర్మాణానికి ఐదెకరాలను కేటాయించారు. సకాలంలో ఖర్చు చేయకపోవడంతో నాబార్డ్ నిధులు మంజూరు నిలిచిపోయింది. ఈ క్రమంలో భవన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

ముందుగానే ప్రయివేటు కళాశాలలు ప్రారంభం

పాలిటెక్నిక్ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వడంలో ఈ ఏడాది ప్రభుత్వం నెల రోజులు ఆలస్యం చేసింది. ఈ క్రమంలోనే ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యార్థుల నుంచి నెల రోజులు ముందుగానే అడ్మిషన్లు తీసుకుని క్లాసులు ప్రారంభించాయి. దీంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోయినట్లు తెలిసింది.

వారంలో స్పాట్ అడ్మిషన్లు

బి.శైలజ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, మచిలీపట్నం

ఈ ఏడాది అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీలో ఆలస్యం జరిగింది. అంతేగాక ఇక్కడ ఇఇఇ, ఇసి, సిఇసి కోర్సులు అందుబాటులో లేవు. దీంతో మెకానికల్ బ్రాంచిలో ఒక్క విద్యార్థి మాత్రమే చేరారు. వారంలో స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

విమానాశ్రయంలో సిఎం జగన్‌కు స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి. రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలకు చెందిన

సిఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంఎల్‌ఎలు కైలే, వంశీ

ఎంఎల్‌ఎలు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తాడేపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి

'ఊరూరా -జన విజ్ఞానం'లో వెంకటేశ్వరరెడ్డి పిలుపు

మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ : అభివృద్ధి నిరోధక మూఢనమ్మకాలు, మూఢాచారాలు, మతోన్మాద పోకడలు విస్తృత స్థాయిలో ప్రచారంలో ఉన్న నేటి తరుణంలో 'విజ్ఞాన స్ఫూర్తి, శాస్త్రీయ ఆలోచనను' ప్రజల్లో పెంపొందించాల్సిన కర్తవ్యం జన విజ్ఞాన వేదిక-సాంస్కృతిక విభాగంపై ఎంతో ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఊరూరా జన విజ్ఞానం-కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం విజయవాడలోని కౌతా పూర్ణానందం కళావేదికలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన సమాజం (నాలెడ్జ్ సొసైటీ)గా మన సమాజం అభివృద్ధి చెందాలని కోరారు. ఇటీవల ప్రయోగించిన చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన (మిగతా 6లో)

తిరువూరులో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి

సంఘర్షణ యాత్రలో ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఎస్ఎఫ్ఐ జిల్లాలో చేపట్టిన సంఘర్షణ సైకిల్‌యాత్రకు ఆరో రోజు మంగళవారం తిరువూరు పట్టణం చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రకు మదిర రోడ్డు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ హాస్టల్‌ను, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈయాత్ర విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి, ఎన్టీఆర్ జిల్లా విద్యా రంగ అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ సంఘర్షణ సైకిల్ యాత్ర నిర్వహిస్తుందని వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్ తెలిపారు. ఈ సంఘర్షణ సైకిల్ యాత్రను వివిధ ప్రాంతాల్లో పర్యటించి విద్యార్థులను సమస్య అడిగి తెలుసుకున్నామన్నారు. తిరువూరు పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలని, మెస్‌ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలనీ, ప్రభుత్వ డిగ్రీ, బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో, జూనియర్ కళాశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, మండలంలో గ్రామాలకు వెళ్లే బడి బస్సుల సంఖ్య పెంచాలని, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి మన్మథ, కుమారస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మాధవ్, రిజ్వాన్, తిరువూరు పట్టణ నాయకులు మోహన్ కష్ణ, శిరీష, రాహుల్, రాకేష్, నరసింహ పాల్గొన్నారు.

సంఘర్షణ యాత్రలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గడపగడపకు కార్యక్రమంలో సామినేని

సంక్షేమమే జగనన్న ధ్యేయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంక్షోభాలెనున్న సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని 2వ సచివాలయం 5వ వార్డ్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యులు సామినేని ఉదయభాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రపథంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వార్డ్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, ఎన్టీఆర్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డ్ నాయకులు పాల్గొన్నారు.

సాగునీరు, మద్దతు ధరకు ప్రాధాన్యత : ఎంఎల్‌సి

: ఎంఎల్‌సి అరుణ్ కుమార్

మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- నందిగామ : సాగునీరు, మద్దతు ధరకు ప్రభుత్వం ప్రాధాన్యతలు ఇస్తుందని ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా 3వ నీటిపారుదల సలహా మండలి సమావేశం వ్యవసాయ సలహా మండలి సమావేశంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ నందిగామ నియోజకవర్గంలో నీటిపారుదలకు – వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు. రైతుల శ్రేయస్సు కోసం నందిగామ పరిధిలో చేపట్టిన పనులకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మల్లాది విష్ణు, ఇరిగేషన్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు, వ్యవసాయ అధికారులు, కెడిసిసిబి డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, నందిగామ మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, సొసైటీ అధ్యక్షులు పాములపాటి రమేష్ పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్‌సి వర్గీకరణ కోరుతూ రిలే దీక్షలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 18 నుండి 22 వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి కూచిపూడి సత్యం మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఎస్‌సి వర్గీకరణ కోరుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నేపాక కాంతారావు మాదిగ, వేమవరపు అర్లయ్య మాదిగ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కూచిపూడి సత్యం మాదిగ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో గల బిజెపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మాట ఇచ్చి ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి మాట తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మాతంగి దావీదు మాదిగ, నియోజకవర్గ ఇన్చార్జి మంద పిచ్చయ్య మాదిగ, నియోజకవర్గ నాయకులు అన్నేపాక దుర్గా మహేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి నేతల తీరుపై న్యాయవాదుల ఫిర్యాదు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ తెలుగుదేశం నాయకుల వ్యవహార శైలి సభ్యసమాజం తలదించుకునేలా ఉందని నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విమర్శించారు. సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టిడిపి నాయకులపై నందిగామ సిఐ కె.హనీష్‌కు న్యాయవాదులు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. అనంతరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో లీగల్ సభ్యులు మాట్లాడారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జున రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని వ్యక్తిగతంగా, అత్యంత అవమానకరంగా దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సమక్షంలోనే ఆమె నివాసంలో తెలుగుదేశం నేతలు సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని అత్యంత అవమానకరంగా దూషిస్తున్నా.. ఆమె కనీసం వారించకపోవడం హేయనీయం అన్నారు. నందిగామలో ఘర్షణలు జరిగేలా.. రెచ్చగొట్టేలా.. తెలుగుదేశం పార్టీ నేతలు పథకం ప్రకారం కుట్రలు చేస్తున్నారని, ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న తెలుగుదేశం నేతలపై కేసు నమోదు చేసి, తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వైసిపి లీగల్ సెల్ సభ్యులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, అద్దంకి మణిబాబు, పింగళి లక్ష్మీ నరసింహారావు, షేక్ సైదా, మంగళపూడి కోటి బాబు, సన్నీ, వేల్పుల ప్రభాకర్, విజయభాస్కర్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ సిఐకు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆంధ్రా లయోల కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నగర ప్రముఖులు అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం గురించి విద్యార్థులకు వివరించారు. ఓటు వేసే ముందు ఆ నాయకుడు ఎవరు ఏం చేస్తారు అని చూసి వేయాలి కానీ ఏ కులం ఏ మతం ఏ ప్రాంతం అని కాకుండా ఆ వ్యక్తి మంచివాడా కాదా అని మాత్రమే గమనించి ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఓటు హక్కును నిర్భయంగా స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును చక్కగా సద్వినియోగం చేయాలని వివరించారు. ఈ సమావేశంలో రాజనీతి శాస్త్ర శాఖధిపతి డాక్టర్ ఏ.శామ్యూల్ దయాకర్ డాక్టర్, మొవ్వ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పూర్ణిమ రవీంద్రనాథ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అమర్నాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బాపూజీ ఆశయాలను విద్యార్థులు సాధించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జాతిపిత మహాత్మాగాంధీ సత్యం, అహింసలనే ఆయుధంగా చేసుకుని మనదేశానికి స్వాతంత్య్రం తెచ్చారని, ఆయన ఆశయాల సాధనకై విద్యార్థినీ విద్యార్థులు కృషిచేయాలని మహాత్మాగాంధీ దేవాలయం వ్యవస్థాపకులు, స్వాతంత్ర్యసమరయోధుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పాలఫ్యాక్టరీ సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలోని గాంధీ దేవాలయంలో గాంధీ దీక్షల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పలువురు కళాశాల విద్యార్థులకు గాంధీ దీక్షామాలలు వేశారు. జయప్రకాష్, ప్రిన్సిపాల్ దండాబత్తిన సరళ మాట్లాడుతూ మహాత్ముని ఆశయా లను విద్యార్థులు ఆచరించి ఉత్తమ భారతపౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు గాంధీ దీక్షలను స్వీకరించారు.

గాంధీ దీక్షలను ఇస్తున్న రాంపిల్ల జయప్రకాష్

స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న దృశ్యం

గంపలగూడెంలో స్కూల్ గేమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. ఈ ఆటల పోటీలను మండల పరిషత్ అభివద్ధి అధికారి ప్రారంభించగా, తొమ్మిది రకాల ఆటలను పాడించి నియోజకవర్గం సెలెక్ట్ చేయనున్నట్లు పిఇటి గుర్రం గోపాలరావు తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు కొనసాగిస్తామని ఆమె కుటుంబ సభ్యులు కళ్ళే నాగేశ్వరరావు, కళ్ళే సీతా మహాలక్ష్మిలు తెలిపారు. కళ్ళే లలిత జ్ఞాపకార్థం ప్రతి నెల 12వ తేదీన పేదలకు అన్నసమారాధన కార్యక్రమం సింగ్‌నగర్లోని తమ ఇంటి వద్ద నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి చంటి, కళ్ళే నాగేశ్వరరావు,ముప్పూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి ప్రారంభిస్తున్న సర్పంచ్ బాబూరావు

జలజీవన్ మిషన్ కింద బోరు బావి ఏర్పాటు

ప్రజాశక్తి - గంపలగూడెం: జలజీవన్ మిషన్ నిధుల నుండి నూతనంగా బోరుబావిని ఏర్పాటు చేస్తున్నట్లు దుందిరాలపాడు సర్పంచ్ బంక బాబురావు తెలిపారు. ఈ మేరకు మంగళ వారం వేసేందుకు కొబ్బరికాయ కొట్టి ప్రారం భించారు. దీనితో గ్రామంలో మంచినీరు ప్రజలకు సంతప్తికరంగా సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధి కారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణమేళా

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలోని తునికిపాడు, దుందిరాలపాడు, ఊటుకూరు, గాదవారిగూడెం, తదితర గ్రామాల్లో ఉన్న వైయస్సార్ చేయూత పథకానికి సంబంధించి రుణమేల నిర్వహించినట్లు ఎంపిడిఒ వైపి రెడ్డి తెలిపారు. వూటుకూరులో జరిగిన ఈ రుణ మేళా కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. పాడి గేదెలను తమ బ్యాంకు ద్వారా అందజేస్తామని, వాటికి అవసరమైన వివిధ పోషకాలకు అవసరమైన నగదు కూడా ఇవ్వనున్నట్లు వివరించారు. తహశీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం పట్ల హర్షం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహాల శాఖ ద్వారా పాస్టర్లకు ఈ రోజు 5 నెలల గౌరవ వేతనం 25 వేల రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ క్రిష్టియన్ జెఎసి చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మనసున్న మారాజు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి హయంలో క్రైస్తవులు సంతప్తి కరంగా, సంతోషంగా ఉన్నారన్నారు.

వేగంగా ఓటర్ల జాబితా పరిశీలన : కలెక్టర్

ఓటర్ల జాబితాపై సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం చురుకుగా కొనసాగుతున్నదని, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకె మీనా మంగళవారం అమరావతి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ జిల్లాల్లో ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమ నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ బంగ్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం పురోగతి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో జరుగుతున్న ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం సంబంధించి ఇంటింటి వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. ఓటర్ల జాబితాల ఇంటింటి వెరిఫికేషన్ లో ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి, అట్టి వారి నుండి ఫారం- 6 సేకరించి ఓటరుగా నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు, మరణించిన ఓటర్ల ను తొలగించుటకు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఏనియోజకవర్గంలోనైనా ఫారం-6 అధిక సంఖ్యలో వచ్చిన సందర్భాల్లో సమగ్ర పరిశీలన జరుపుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఫారం-7, ఫారం-8 ప్రస్తుత పరిష్కార స్థితి వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరించి పోలింగ్ కేంద్రాల రేషన లైజేషన్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఫోటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి వచ్చిన ఫిర్యాదులపై తగిన వెరిఫికేషన్ నిర్వహించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పోలీసుల దౌర్జన్యం హేయం : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ: బంద్ కి మద్దతు ఇచ్చి బందుకు సహకరించండి అని ప్రచారం చేసే వాళ్ళ మీద పోలీసులు దౌర్జన్యం చేయటం సరైనది కాదని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అన్నారు. గుడివాడ సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో బందు సందర్భంగా ప్రజాస్వామ్యంగా జరిగే బందులో కార్యకర్తలని అడ్డంపడితే తీసుకెళ్లి అరెస్టు చేసి స్టేషన్లో కూర్చోబెట్టాలి కానీ వాళ్ళమీద పిడుగులు గుద్ది వాళ్ళందరినీ భయభ్రాంతులను గురిచేసే వాళ్ళ నాయకత్వం మీద విపరీతమైన దాడి చేయటాన్ని సిపిఎం పార్టీగా ఖండిస్తున్నామన్నారు. ఇవ్వాళ ప్రజాస్వామ్య హక్కులు ప్రకారం వాళ్ళ రాష్ట్రవ్యాప్తంగా బంద్ కి మద్దతు ఇస్తే ఆ బందులో తెలుగుదేశాన్ని అట్లాగే జనసేన, ఎమ్మార్పీఎస్ ఇంకా అనేక చిన్న చిన్న పార్టీలు బంద్ కి మద్దతు ఇచ్చి బంద్ ని జయప్రదం చేయండి అని షాపులు చుట్టూ తిరుగుతున్న సందర్భంలో పోలీసులు వాళ్ళ మీద దౌర్జన్యం చేయటం సమాజానికి సిగ్గుచేటు అన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలు మానుకోవాలని ఈ సందర్భంగా సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎవరు అధికారంలో ఉంటే వాళ్ళ వత్తాసు పలికే పోలీసు వ్యవస్థ సరైంది కాదని పోలీసులు కూడా నిష్పక్షపాతంగా ఇబ్బందులు గురిచేస్తూ ఉన్నప్పుడు వాళ్ళ కంట్రోల్ చేయాలన్నారు. కానీ వాళ్ళ మీద దౌర్జన్యం చేయడం అనేది వీడియోలు చూస్తే చాలా దారుణంగా ఆ వీడియోలో ఉన్న పరిస్థితి ఉందని, పోలీసులు రౌడీల్లాగా వాళ్ళ మీద పడి అరెస్టులు చేయటం అనేది దౌర్భాగ్యమన్నారు. ఈ సమావేశంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌సిపి రెడ్డి

ఇళ్లపట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని విన్నకోట శివారు జేమ్స్ పేట గ్రామ దళితులు తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండల తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. 40 కుటుంబాల దళితులకు ఎన్నో ఏళ్ల క్రితం పొజిషన్ సర్టిఫికెట్లు ప్రభుత్వం ఇచ్చిందని, వాటిలో పూరిపాకలు వేసుకుని నివాసముంటున్నామని, అయితే పక్కా గృహాల నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్లు సరిపోవని గృహ నిర్మాణ శాఖ చెబుతున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బుల్లా కింగ్, గాలంకి నాగేంద్రరావు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈనెల 13న ఉంగుటూరులో జరుగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉంగుటూరు మండల పరిషత్ ఆవరణలోని స్త్రీ శక్తి భవనం మీటింగ్ హాల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ డి.వనజాక్షి తెలిపారు.

16 నుంచి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు: మహిళా స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి మహిళలకు మగ్గం వర్కులో ఉచిత శిక్షణ నిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షురాలు పడమట భువనేశ్వరీదేవి తెలిపారు. సొసైటీ చేస్తున్న సేవాకార్యక్రమాల్లో భాగంగా మహిళలకు కుట్లు, మగ్గంవర్క్, అల్లికలు, ఇతర చేతిపనులు నేర్పించడం ద్వారా వారి ఆర్థిక స్వాలంభనకు తోడ్పడాలన్న ఉద్దేశంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మగ్గం వర్కుకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉన్న నేపథ్యంలో శిక్షణ ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9963501288 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 27 న ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భముగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతిభ కనపరిచిన హోటల్స్, రెస్టారెంట్స్, టూర్స్ అండ్ ట్రావెల్స్ మొదలగు వాటి నుండి రాష్ట్ర ఉత్తమ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి, ఇంఛార్జి అధికారి ఫణి దుర్గేటి ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 19న సాయంత్రం ఐదు గంటల్లోపు www.aptourism.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'చదువుతో పాటు క్రీడలూ అవసరం'

ప్రజాశక్తి-పెడన: ప్రపంచ దేశాల అన్నింటిని మించి అంతరిక్ష శాస్త్రంలో భారత్ ముందంజలో ఉందని ఇది యావత్ భారత్ ప్రజల అందరికీ గర్వకారణమని బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు మట్ట రాధాకృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని ఆ పాఠశాలలో జరిగిన చంద్రయాన్-3 విజయోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఉష అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ క్రీడలు విద్యలో ఒక భాగమేనని చదువుకు ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారు క్రీడలకు అంతే ప్రాముఖ్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. క్రీడల శరీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహద పడతాయి అన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి పాఠశాలకు క్రీడా సామాగ్రి కొనుగోలు చేయడానికి పదివేల రూపాయలు ప్రధానోపాధ్యాయురాలు ఉషాకి అందజేశారు. విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి క్రీడాకారులుగా తయారై జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలై పట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అలాగే తల్లితండ్రులకు కూడా మంచి కీర్తిని తీసుకురావాలని ఆయన సూచించారు. క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగాలు సంపాదించారని ఆయన తెలిపారు. అలాగే విద్యార్థిని విద్యార్థులు అందరూ మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రికి నగదు అందజేస్తున్న రాధాకృష్ణమూర్తి

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-పెదపారుపూడి: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించుకోవచ్చని గుడివాడ అగ్నిమాపక అధికారి జె ఆంజనేయులు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ వానపాముల గ్రామ సచివాలయాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదా లు జరిగితే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకుంటే నివారించుకోవచ్చు అని తెలియజేశారు. అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. గ్రామాలలో గ్రామ వాలంటీర్లు ప్రజలను అగ్నిప్రమాదాలపై చైతన్య పరచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు అప్పికట్ల ఆశాజ్యోతి, రమేష్ లీడింగ్ ఫైర్ మాన్ శ్రీనివాసరావు గోరి పర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నేడు మచిలీపట్నంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లా ఉపాధి కార్యాలయము, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ మరియు సీ డాప్ వారి సంయుక్త ఆధ్వర్యములో నేడు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర గల నోబుల్ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ఇంఛార్జ్ ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు సంస్థలు, కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి ఆపైన చదివిన విద్యార్థులు 18 నుండి 35 సంవత్సరాల వారు హాజరుకావచ్చన్నారు. పేర్లు WWW.NCS.GOV.IN ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు, చేసుకోలేకపోయిన వారు బయో డేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్‌తో బుధవారం ఉదయం పది గంటలకు నోబుల్ కాలేజీలో జరిగే ఎంపికలకు హాజరుకావాలని, వివరాలకు 8142416211కు సంప్రదించాలని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి ఎటువంటి టిఏ, డిఏ ఇవ్వబడదన్నారు.

మట్టి ఖర్చులు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలో మాజేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కలిగి ఇటీవల మరణించిన పాతమాజేరు గ్రామానికి చెందిన చోడగం పాండురంగారావు మట్టి ఖర్చుల నిమిత్తం మాజేరు పిఎసిఎస్ తరుపున పిఎసిఎస్ ఛైర్ పర్సన్ అరజా శివశంకర్ రూ.10 వేలు వారి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్య క్రమంలో సంఘ సిఇఓ ఎస్-ఎస్ చక్రపాణి, పర్సన్స్ మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు మండల పరిధిలో జాతీయరహదారి పక్కన సర్వీసురోడ్డుల వర్షపునీటితో చెరువులను తలపిస్తున్నాయి. గండిగుంట, ఆకునూరు, కాటూరు రోడ్లలో అండర్ పాసులు వద్ద సర్వీసురోడ్లకు డ్రైనేజి సౌకర్యం లేక వర్షపునీరు నిలిచి వాహనాలు నడిపేవారితో పాటు పాదాచారులకు సైతం అసౌకర్యం కలుగుతుంది. సర్వీసు రోడ్డుపక్కన ఏర్పా టుచేసిన డ్రైనేజి అస్తవ్యస్తంగా ఉండగా పట్టించుకునేవారు లేకపోవడంతో నీరు పోయే మార్గం లేక నిలిచిపోతుంది. రోడ్డుపై నీరు నిలిచి అసౌకర్యంగా ఉన్న పరిస్థితిని జాతీయ రహదారుల అధికారులు, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గూడూరులో స్కూల్ గేమ్స్ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న మధుసూదనరావు

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ అండర్14,17 ఎంపిక ఆటల పోటీలను గూడూరు మండలం ప్రజా పరిషత్ అధ్యక్షులు సంఘ మధుసూదనరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. అక్టోబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర అనే ప్రోగ్రామ్ ను ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. మంత్రి జోగి రమేష్ పెడన నియోజకవర్గంలో ఎక్కువ క్రీడల పోటీలను నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను మన పెడన నియోజకవర్గం నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు పంపించడం జరిగిందని, ప్రభు జాతీయ స్థాయిలో ప్రతిభను చాటి క్రీడా కోటలో ఉద్యోగం సాధించడం జరిగిందని అలా క్రీడాకారులందరూ క్రీడా కోటాను వినియోగించుకొని ఉద్యోగ అవకాశాలను అందుపుచ్చుకోవాలని అన్నారు.క్రీడల ద్వారా మన గూడూరు మండలానికి, పెడన నియోజకవర్గానికి మంచి పేరు ప్రతిష్టలను తీసుకొని రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గూడూరు ఎం ఈ ఒ శేఖర్ సింగ్, గూడూరు గ్రామ ప్రెసిడెంట్ భర్త విజయ్ కుమార్, హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వాసు,ఇంచార్జి హెచ్ ఎం పద్మజ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి, జాతీయ క్రీడాకారుడు ప్రభు,పి డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణను కలిసిన సౌమ్య, తదితరులు

బాలకృష్ణను కలిసిన తంగిరాల సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ : సినీ నటులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణను మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాల యంలో నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కలిశారు. సమకాలిన రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం బాలకృష్ణతో పాటు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ రుణమేళా

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం రైతు భరోసా కేంద్రంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మహిళ పాడి రైతుల ప్రయోజనం కోసం చేపట్టిన సహకార డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జగనన్న పాలవెల్లువ వలన మహిళ పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో పాడి రైతులకు మేలు చేసే సహకార సంస్థ తిరిగి బలోపేతం చేసేందుకు జగనన్న పాలవెల్లువ దోహదపడుతుందన్నారు. ఎలాంటి షూరిటీలు లేకుండా మహిళ పాడి రైతులకు రూ. 30 వేలు పర్కింగ్ క్యాపిటల్ అందిస్తామన్నారు. ఎలాంటి షూరిటీలు లేకుండా పాలు పోసే రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా పాడి పశువులు కొనుగోలుకు రూ.1 లక్ష రూపాయలు వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం జరుగుతుందన్నారు. జగనన్న పాల వెల్లువలతో మహిళలు ఆర్థిక పురోభివద్ధి దిశగా ఇప్పటికే కొన్ని జిల్లాలో చేపట్టిన కార్యక్రమం ముందుకు వెళుతుందన్నారు. మరో వైపు పాడి రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్, ఎంపిటిసి సభ్యులు కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, ఎంపిడిఒ విష్ణు ప్రసాద్, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి నారాయణరెడ్డి, మహిళా పాలఉత్పత్తిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ్

ప్రజాశక్తి - తిరువూరు : ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు జి.రామయ్య తెలిపారు. ఈనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాల అమలుకు కేంద్ర విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. 10 రోజులు కొనసాగిన ఈ కార్యక్రమంలో పరిసరాల శుభ్రత, ఆరోగ్యం, చేతులు కడుక్కోవడం, మాస్క్ ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వివిధ అంశాలపై ఫోటోలు, వీడియోలు, పోస్టర్లు, పెయింటింగ్ లు,స్వచ్ఛతా ఛాయాచిత్రాలను ప్రదర్శించడంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వ హించి ప్రథమ, ద్వితీయ బహుమతులందజేశారు.

విద్యుత్ శాఖాధికారుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని గణపవరం సెక్షన్ కింద మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మొత్తం 42 బందాలుగా ఏర్పడి 3,471 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ బి.కమల కుమారి, విజయవాడ రూరల్ ఈ ఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ సౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అధిక లోడు వాడుతున్న 228 మంది నుండిరూ.4-72 లక్షలు అపరాధ రుసుంగా విధించామన్నారు. వ్యవసాయ కలెక్షన్లకు డబ్బులు చెల్లించిన వారికి వెంటనే సర్వీస్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యుత్ సౌర్యం సామాజిక నేరమని ఎవరైనా విద్యుత్ సౌర్యానికి పాల్పడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎడిఇలు సుధాకర్, నవీన్, గణపవరం ఎఇ సాంబశివరావు లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 45వ డివిజన్లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, మెట్లు, కాలువలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య చెప్పారు. డివిజన్లోని కబేళా రోడ్డు వద్ద రూ.11 లక్షల వ్యయంతో రోడ్డును నిర్మించినందుకు అభినందనగా స్థానిక ప్రజలు కార్పొరేటర్ మాధురి లావణ్యను, స్థానిక వైసిపి నాయకులు మైలవరపు కష్ణను మంగళవానం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధురి లావణ్య మాట్లాడుతూ డివిజన్ అభివద్ధికి శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే నగర మేయర్ భాగ్యలక్ష్మి తమకు ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. వైసిపి నాయకులు మైలవరపు కష్ణ మాట్లాడుతూ డివిజన్‌ను సమగ్రంగా అభివద్ధి చేయడంలో శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సహకారం ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికులు న్యాయవాది మూర్తి, జానకి, మురళి, చక్క సుబ్బారావు, ఎస్ సతీష్, అనసూయ, నాగేశ్వరరావు, చిమట వెంకటేశ్వరరావు, వెల్లవల్లి దుర్గాదేవి, పీసా తమ్మి నాయుడు, భాస్కర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మాధురీ లావణ్యకు సత్కారం

నూతన పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్‌లో నేడు కొత్తగా మంజూరు అయిన పింఛన్లను స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేయడమే లక్ష్యంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవ చూపుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నారని తెలిపారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా వాలంటరీల సహాయంతో అర్హులను గుర్తించడంలో చాలా త్వరితగతిన ప్రజలకు పథకాలు పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పక్కుర్తి రామకష్ణ, మరుపిళ్ళ తిలక్, పిళ్ళ ఆనంద్ కుమార్, 51వ డివిజన్ సచివాలయల సెక్రటరీలు రమేష్, ఆంజనేయులు, వీర ప్రసాద్, శ్రీనివాస్, వెల్ఫేర్ అధికారులు, వాలంటిర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్

న్యాయం గెలిచే వరకూ పోరాడతాం

ప్రజాశక్తి - తిరువూరు : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు వ్యతరేకంగా న్యాయం, ధర్మం గెలిచే వరకు అందరం కలిసి పోరాటం చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందామని టిడిపి సీని యర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ వివిధ పార్టీలకు పిలుపునిచ్చారు. తిరువూరులోని ఆ యన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా మద్దతు తెలిపిన జనసేన, సిపిఐ, ఎంఆ ర్పీఎస్, వివిధ ప్రజా సంఘాల నాయకులకు అభినంద నలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల సహాయ సహకారాలతో చంద్రబాబు విడుదల అయ్యేంతవరకు. పోరాటాన్ని ఉధతం చేస్తామని తెలిపారు. నీతి నిజాయితీగా కలిగి 14 సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రిగా పరి పాలించి, ఈరాష్ట్రంలో మహిళా అభ్యుదయం కోసం డాక్రా సంఘాలు పెట్టినటువంటి వ్యక్తి చంద్రబాబు అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ ను అభివద్ధిలో ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బొమ్మసాని మహేష్, నాయకులు బొలినేని రాజా, నాళ్ళ సురేంద్ర, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, బోయపాటి రామకష్ణ, గొల్లమందుల జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాస్

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వన్‌టౌన్ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లోని సి.ఎస్.ఈ., సి.ఐ.సి. మరియు రోటరాక్ట్ క్లబ్ విభాగాల ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం చదువుతున్న సంబంధిత విద్యార్థులకు "హౌటు మేక్ ఎ. ప్రొఫెషనల్ రెజ్యూమ్" అనే అంశంపై కళాశాలలో మంగళవారం సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎక్ట్రానిక్స్ సిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ కష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి మనిషికీ తాను అనుకున్న లక్ష్యాలను సాధించాలనే తపన ఉంటుందన్నారు. కానీ వారిలో కొంత మంది మాత్రమే అనుకున్న లక్ష్యానికి చేరుకుని విజయం సాధిస్తున్నారన్నారు. మరో అతిథి సైకాలజీలో పి.జి. ఇంగ్లీష్ లిటరేచర్ చేసిన గంగ్నీత్ కౌర్ మాట్లాడుతూ ఏ సంస్థలో అయినా ఎంపిక కోసం ఎన్ని రౌండ్లు నిర్వహించినప్పటికీ చివరగా ఇంటర్వ్యూ ద్వారానే ఉద్యోగం పొందుతారని తెలిపారు. కొంతమంది ఎన్ని ఇంటర్వ్యూలకు హాజరైనప్పటికీ వారిలో సందిగ్ధత అలాగే ఉంటుందని, ఏ సంస్థలో అయినా ఉద్యోగం పొందాలంటే ఇంటర్వ్యూ తప్పని సరన్నారు. ఇంటర్వ్యూ సమయంలో దృడసంకల్పంతో, ధైర్యంగా, తెలివితేటలతో వ్యవహరించా లన్నారు. విజయవాడలోని "బి బెస్ట్ కన్సల్టెన్సీ" యం.డి. రొటేరియన్ ఖరంభీర్ కౌర్ మాట్లాడుతూ నిజ జీవితంలో మరియు కాలేజీలో మీకు ఎదురైన కఠినమైన సవాళ్ళి అధిగమించుకొని ముందుకు సాగాలన్నారు. కష్టించి పని చేయగల సామర్థ్యాన్ని, నైపుణ్యత లక్షణాలను స్వతహాగా మనకు మనమే వెంపొందించుకోవాలన్నారు. హెచ్.ఆర్ కన్సల్టెంగ్ ఫిర్మ్ కపిల్ సోముని మాట్లాడుతూ మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగం పొందాలంటే అత్యుతమైన నైపుణ్యతపరమైన అంశాలే కాకుండా ప్రొఫెషనల్ రెజ్యూమ్ను ఏవిధంగా తయారుచేయాలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ పడుచూరి లక్ష్మణ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె, లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. పతంజలి శాస్త్రి, విభాగాధిపతులు డా. డి. దుర్గాప్రసాద్, పి.శ్రీ శిల్ప, రోటరాక్ట్ క్లబ్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. నరేష్, రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ సాకేత్, సెక్రటరీ ఉమ, క్లబ్ ప్రొఫెషనల్ సర్వీస్ డైరెక్టర్ మధు మరియు క్లబ్ బోర్డు మెంబర్లు, విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రముఖులు

రాకేష్ త్రిపతి శర్మను అభినందిస్తున్న ఎన్.వి.రావు, కుటుంబ సభ్యులు

శతాధికవృద్ధుడు శర్మకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మొదటి భారతీయ అంతరిక్ష వ్యోమగామి రాకేశ్ శర్మ మాతమూర్తి త్రిపతి శర్మకి నూరేళ్లు నిండి 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టి సందర్భంగా రాకేష్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.రావు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని రాకేష్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.రావు, భార్య రేణుకదేవి, కుమార్తె డాక్టర్ నీరజ, అల్లుడు భోగవల్లి ఉదయకిరణ్, వియ్యపురాలు భోగవల్లి అమ్మాజీలు మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాకేష్ శర్మ, వారి కుమారుడు బాలీవుడ్ డైరెక్టర్ కపిల్ శర్మతో కలసి వారి మాతృమూర్తి రాకేష్ త్రిపతి శర్మని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్.వి.రావు మాట్లాడుతూ వంద సంవత్సరాలు పూర్తిచేసుకుని 101 సంవత్సరంలోకి అడుగు పెట్టడం ఎంతో అభినందనీయమన్నారు. తమ పాఠశాలకు రాకేష్ శర్మ పేరు పెట్టి ఎంతో మందికి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాకేష్ శర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గూడవల్లిలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ రూరల్ పరిధిలో మండల స్థాయి జగనన్నకి చెబుతాం కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటలకు గూడవల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. గ్రామ ప్రజలు పాల్గొని వారి అవసరాల నిమిత్తం అర్జీ దాఖలు చేసుకోవాల్సిందిగా ఎంపిడిఒ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారికి సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని తొర్రగుంటపాలెంకు చెందిన పున్నావళి భవ్య శ్రీ పుట్టుకతోనే చెవుడు (హియరింగ్ లాస్) ఉండడంతో కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయాలని డాక్టర్లు పాప తల్లిదండ్రులకు తెలుపగా వారు ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యులు సామినేని ఉదయభాను దష్టికి తీసుకువచ్చారు. దీనితో స్పందించిన ఆయన మానవతా దక్పథంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లడం జరిగింది. వెనువెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 4.85లక్షలు ముందస్తు వైద్య ఖర్చులు (ఎల్‌ఓసి)ఇటీవల కాలంలో మంజూరు చేయించారు. తిరుపతిలోని బర్డ్ హాస్పటల్‌లో పాపకు వైద్యం చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, మాజీ ఎంపిపి గూడపాటి శ్రీనివాసరావు, జెపి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి సాయం అందజేసిన సామినేని

విజృంభిస్తున్న విష జ్వరాలు

ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి-గన్నవరం: వర్షాలు... గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం... విజంభించిన దోమలు... వ్యాధుల భారినపడి ప్రజానీకం..ఇది గ్రామాల్లో నెలకొన్న పరిస్థితి. జ్వరాల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. దీనికి కారణం గ్రామాల్లో మురుగు, ఆక్రమణలు ఎక్కువవడంతో ఈ పరిస్థితి వచ్చిందని కొంతమంది వెలుతున్నారు. ఇళ్లలోని మురుగు నీరు బయటకు వెళ్లేందుకు వీలులేకుండా అక్రమ కట్టడాలు కట్టేశారని బిబహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు అవగాహనా లోపంతో సిమెంట్ రోడ్ల వెంట డ్రైనేజ్ కట్టకుండా వదిలేయడంతో గత పదేళ్లగా గన్నవరం, ముస్తాబాద, సూరంపల్లి, తెంపల్లి, చిన్నవటపల్లి లలో జనాలు మురుగునీటి తో అవస్థలు పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వర్షం పడితే ఈ రోడ్ల పై మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో వీరి ప్రవాహం కొనసాగుతోంది. రోజుల తరబడి ఆ నీరు నిల్వ ఉండిపోవడంతో మర్వాసన వస్తోంది. దోమలు ఉత్పత్తి అయ్యి అవి జనాల మీద దాడులు చేయడంతో విష్వరాలు ప్రబలుతున్నాయి. అయితే మురుగు కాలువలు శుభ్రం వేయించడం లేదని స్థానికులు చెప్పారు. దీంతో మురుగు వైపులైన్ల లో కలిసి జనాలకు సరఫరా అతిసార అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పంచాయతీల్లో నిధుల లేమి?

మేజర్, మైనర్ పంచాయతీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. పంచాయతీలో కనీసం పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుం దామన్నా రూపాయి లేదని పాలక వర్గం చెబుతోంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ఉన్నత అధికారులు గ్రామంలోకి వచ్చి. ఆ పనులు చేయండి... ఈ పనులు చేయండి అంటూ ఆదేశాలు ఇవ్వడమే తప్ప నిధులు ఇచ్చిన పరిస్థితి లేదని గ్రామస్తులు నుండి పడుతున్నారు. డబ్బులు లేకుండా గ్రామంలో ఏ విధంగా పనులు చేపడతారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్, కార్యదర్శు లు దిక్కుతోచని పరిస్థితుల్లో అధికారుల ఒత్తిడిని అధిగమించడానికి సొంత నిధులను ముందస్తుగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం పంచాయతీలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తే ఈ పరిస్థితి ఉండదని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా వీటిని క్లోరినేషన్ చేయించి పదులుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు సమస్య ఎక్కువగా ఉంటుందని, జనాలు రోగాల భారిన పడక ముందే పారిశుద్ధ్యం మెరుగుదబడు తక్షణ చర్యలు తీసుకోవాలని మండలంలోని మైనర్ గ్రామ పంచాయతీలోని ప్రజలు కోరుతున్నారు.

మంగళాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-చల్లపల్లి

శిథిలావస్థకు చేరిన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేయించాలని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పంచాయతీరాజ్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని మంగళాపురం శివారు ఏనాయిపాలెం ముదిరాజ్ పాలెల్లో లో మంగళవారంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రభుత్వాన్ని ఇస్తున్న సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, వక్కలగడ్డ, పురిటిగడ్డ సర్పంచ్‌లు వల్లూరి ఉమా, గొరిపర్తి సురేష్, పిఎసిఎస్ ఛైర్ పర్సన్స్ అరజా శివశంకర్, సత్యనారాయణ, పేరం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'మండలి'కి గాడిచర్ల అవార్డు

ప్రజాశక్తి-అవనిగడ్డ

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు పత్రికా రచయిత గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల సర్వోత్తమరావు పేరట ఇచ్చే గాడిచర్ల అవార్డుకు మాజీ ఉపసభాపతి అధికార భాష సంఘం మాజీ అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. గాడిచర్ల ఫౌండేషన్ కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ కర్నూలు ఆంధ్ర ప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు మచిలీపట్నం కృష్ణ యూనివర్సిటీలో జరిగే అవార్డు ప్రధాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని బుద్ధప్రసాద్‌కు అవార్డును ప్రదానం చేస్తారని చెప్పారు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ గాడిచర్ల ఫౌండేషన్ ప్రధాన పోషకులు టీజీ వెంకటేష్, కష్ణాజిల్లా కలెక్టర్ పి రాజాబాబు, కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమని, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కే చంద్రశేఖర తదితరులు పాల్గొంటారని ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, సమన్వయకర్త గుత్తికొండ సుబ్బారావు తెలిపారు.

ఫ్యామిలీ పెన్షన్ పెంపు పట్ల ఎల్ఐసి సిబ్బంది హర్షం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎల్ఐసి సిబ్బందికి 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ పెంపును సెప్టెంబర్ 11 నుండి అమలు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ గెజిట్ విడుదల చేయడం హర్షణీయమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘంమచిలీపట్నం డివిజన్ లిప్రధాన కార్యదర్శి జి కిషోర్ కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సిహెచ్ బ్రహ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జీవిత బీమా సంస్థ మచిలీపట్నం డివిజనల్ ఆఫీస్ వద్ద జరిగిన విజయోత్సవ సభలో వారు మాట్లాడుతూ నాలుగేండ్ల సుదీర్ఘ పోరాటం ఇప్పటికీ సాకారమయ్యిందన్నారు. సాధారణ బీమా సిబ్బందికి కూడా ఫ్యామిలీ పెన్షన్ పెంపు వర్తింపచేస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులలాగే వేతన సవరణ జరిగినప్పుడల్లా ఎల్ఐసి పెన్షనర్ల పెన్షన్ ను కూడా సవరిస్తూ పెన్షన్ అప్డేషన్ చేయాలన్నారు. సర్వీస్ లో చివరి నెల జీతం ఆధారంగా సిబ్బంది పెన్షన్ నిర్ణయించాలన్నారు. నూతన పెన్షన్ స్కీమ్ వర్తించే సిబ్బందికి 14 శాతం పిఎఫ్ యాజమాన్య వాటా ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలన్నారు.

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

ఈ డిమాండ్లపై రాబోయే కాలంలో పోరాడుతామని వారు ప్రతినబూనారు. రాబోయే రోజుల్లో క్లాస్1, క్లాస్ 2 సిబ్బందితో కలిసి జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉద్ధతం చేస్తామని, తమ సమస్యలను పరిష్కరించుకుంటామని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఐసిఇయు నాయకులు జె. సుధాకర్, క్లాస్ వన్ ఆఫీసర్స్ అసోసియేషన్ నుండి వి.శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ నాయకులు దిలీప్ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ క్రీడలు శారీరకదా ఆరోగ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులు క్రీడా స్ఫూర్తి నీ ప్రదర్శించాలన్నారు గెలుపు వాటములను గెలుపు వాటములను సమంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీల్లో స్వయంగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాష, ఎంఈఓ ఎన్ శివశంకరరావు, మండల స్పోర్ట్స్ ఇంచార్జ్ మునగాల ఉదయ్‌కుమార్, ఎంఈఓ 2 అన్నపరెడ్డి ఇచ్ఛేశ్వరరావు, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం కె విజయలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ

మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ వద్రే ఈశ్వరరావు 6వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఈశ్వరరావు సతీమణి మామిడికోళ్ల-పెసరమిల్లి సర్పంచ్ వద్రె విజయలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని కరుణపీఠం, శాంతి, మమత వద్ధాశ్రమాలలో వద్ధులకు పౌష్టికాహారం పండ్లు పంపిణీ చేయాడం అభినందనీయమాని ఎడిటర్ మత్తి శ్రీకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెసరమిల్లి గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్ అల్లూరి రామశాస్త్రి, పంచాయతీ బోర్డు మెంబర్ అల్లూరి నాగనాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుడివాడ: పరిశ్రమలలో భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని పారిశ్రామిక క్లస్టర్ జిల్లా కన్వీనర్ బేతాళ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గుడివాడ సిఐటియు కార్యాలయంలో కృష్ణాజిల్లా పారిశ్రామిక క్లస్టర్ సమావేశం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఉన్న చిన్న చిన్న పరిశ్రమలలో కూడా కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. 1920లో కార్మిక సంఘం ఏర్పడింది. అప్పటినుంచి అనే పోరాడి అనేక హక్కులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సాధించుకోవడం జరిగిందన్నారు. 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చింది. ఈ కోడ్ ల వల్ల కార్మికులు కనీస వేతనం లేకుండా ప్రమాదాలు జరిగినప్పుడు అదేవిధంగా పారిశ్రామిక అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న బేతాళ శ్రీనివాసరావు

పేరుతో శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు. ఈ శ్రమ దోపిడీ నివారించాల్సినటువంటి లేబర్ అధికారులు తమకేమీ పట్టనట్లు కూర్చోవడం శోచనీయమన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలం గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు గోగినేనిపాలెం గ్రామ వాస్తవ్యులు ఘట్టమనేని బాబురావు (ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ మెంబర్) ఆధ్వర్యంలో వారి చేతుల మీదుగా ఉచిత నోట్ బుక్స్ మరియు స్కూల్ బ్యాగులు మంగళవారం పంపిణీ చేయడం జరిగింది. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 6, 7, 8 తరగతులు చదువుతున్న మొత్తం 79 మందికి, 9, 10 తరగతులు చదువుతున్న 70 మందికి నోటు పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల యొక్క విలువైన సమయాన్ని చదువుకోవడం కోసం వెచ్చించి, మంచి పౌరులుగా ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజంలో వెనుకబడిన పేద బడుగు బలహీన వర్గాల నిరుపేదలు అందరికీ, భవిష్యత్తులో ప్రతిఒక్కరూ తమ యొక్క చేతనయినంత సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి గోగినేనిపాలెం గ్రామ వాస్తవ్యులు అత్తలూరి గోపాలరావు, ఘట్టమనేని మారుతీ ప్రసాద్, మాలెంపాటి నరసింహారావు, శ్రీనివాసరావు, అజయ్ బాబు, శివ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదంలో పేపర్‌బాయ్‌కు గాయాలు

చికిత్సకు ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : కుటుంబానికి తనవంతు తోడు అందించేందుకు హనుమాన్ జంక్షన్ కు చెందిన విద్యార్థి ప్రేమ్ సాగర్ ఏలూరు సి ఆర్ రెడ్డి కాలేజీలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుకుంటూ హనుమాన్ జంక్షన్ లో సైకిల్ పై తిరిగి పేపర్లు వేస్తుంటారు.రోజు లాగానే ప్రేమ సాగర్ శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకే లేచి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ కు వచ్చి హనుమాన్ జంక్షన్ లో పేపర్లు వేయటం ముగించాడు. సైకిల్ పై ఇంటికి తిరిగి వెళుతుండగా విజయవాడ రోడ్ నుండి నూజివీడు రోడ్ వైపు వెళుతున్న కార్గో వ్యాన్ ప్రేమ్ సాగర్ ను ఢీకొంది. సైకిల్ తుక్కు తుక్కు అయింది.వ్యాన్ ముందు టైర్ రెండు కాళ్లపై ఎక్కటంతో ఎడమకాలు నుజ్జు అయింది. త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. అక్కడే ఉన్న పోలీసులు హుటాహుటిన స్పందించి 108 లో పిన్నమనేనికి తరలించారు. అక్కడ నుండి విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదానికి ఆరోగ్యశ్రీ అమలు కాకపోవటంతో ఆ నిరుపేద కుటుంబానికి కష్టాలు వచ్చి పడ్డాయి. తండ్రి శంకరం భారత్ హోటల్ లో పనిచేస్తున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం లక్ష రూపాయలకు పైగా ఖర్చు అయ్యే ఈ ఆపరేషన్ కు దాతలు సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వివరాలకు 9347921671 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

మినీ జాబ్‌మేళాలో 13 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుడివాడ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థచే మంగళవారం జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ ఆవకాశాలు కల్పించుటకు మిని జాబ్‌మేళాను నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక కె.బి.ఆర్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మిని జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఇన్నోవసోర్స్ సర్వీసెస్, డిమార్డు, వరుణ్ మోటారు కంపెనీలు పాల్గొని 38 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 13 మందిని తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరిధర్మేంద్ర, సూపరింటెండ్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు జయరాజు, తుర్లపాటి మధు, శేషుబాబు, నాగంజనేయులు, హెచ్‌ఆర్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సిపిఎం అభిమాని భాస్కరరావు కన్నుమూత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సిపిఎం అభిమాని పర్చా భాస్కరరావు (66) గుండెపోటుతో కన్నుమూశారు. విజయవాడ వెూగల్‌రాజపురం వటవంట వారి వీధిలోని ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపిన ఆయనకు అర్ధరాత్రి దాటాక తీవ్ర గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కృష్ణలంకలోని స్వర్గపురిలో మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. కుమార్తెలు మాధురి, మాధవి కలిసి భాస్కరరావు అంత్యక్రియలు నిర్వహించారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తెలు

వీధి కుక్కలకు చట్టాలు : కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : వీధి కుక్కల కోసం ఉన్న నిర్దిష్టమైన చట్టాలను అమలు చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పేర్కొన్నారు. వాటి పట్ల అమానుషంగా, క్రూరంగా, చులకనగా వ్యవహరించకూడదని తెలిపారు. అలా చేస్తే చట్టపరమైన శిక్షర్హ నేరాలకు పాల్పడినట్లేనని తెలిపారు. కుక్కలు, కుక్కలకు ఫీడింగ్ చేసేవారికి రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వును జారీ చేసిందని, వీధి కుక్కలకు ఆహారం పెట్టే వ్యక్తికి ఎవరైనా పరిమితులు విధించినా, నిషేధాలు పెట్టినా లేదా అసౌకర్యానికి గురిచేసినా శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51-ఎ (జి) ప్రకారం 'అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించడం, మెరుగుపరచడం, జీవుల పట్ల కరుణ కలిగి ఉండటం ప్రతి పౌరుడి విధి అన్నారు.

మొదటిపేజీ తరువాయి

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి

అద్భుతమైన అంతరిక్ష రాకెట్ ప్రయోగాలు అని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలు, శాస్త్రీయ భావాల వ్యాప్తికి జనవిజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారున. ఇటీవల బాపట్ల జిల్లా చీరాలలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర 17వ మహాసభలు విజయవంతం అయ్యాయని, ఈ సందర్భంగా ఎన్నికైన నూతన రాష్ట్ర కమిటీకి బాధ్యత పెరిగిందని అన్నారు. సాహితీ విభాగం రాష్ట్ర నాయకులు అమలాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో దేశానికి గొప్ప కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. శాస్త్ర విజ్ఞానం, సైన్స్ సాధించిన గొప్ప విజయాలను, మతనమ్మకాలు, మూఢ విశ్వాసాలు ప్రజల భావోద్వేగాలతో మిళితం చేసి ప్రజలను గందరగోళం చేస్తున్నారని, ఇటువంటి చర్యలను తిప్పికొట్టాల్సిన బాధ్యత సాహితీ వేత్తలు, సాహితీ అభిమానులపై ఎంతైనా ఉందన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షులు చింతకాలయ చిట్టిబాబు, జన విజ్ఞాన వేదిక నాయకులు శ్యామ్ ప్రసాద్, జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు పాడిన తెలుగు సినిమాల్లోని చందమామ పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వాణిజ్య పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

విషయాలను దష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలు సాగుచేసేలా వాస్తవ పరిస్థితులను వివరించాలని అన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగర్ ఎడమ కాలువ గట్లను రహదారులుగా అభివద్ధి చేయాలన్నారు. మైనర్ ఇరిగేషన్ కాలువలలో ఉపాధి హామీలో చేపడుతున్న పనులు ఆశించిన స్థాయిలో ఉండటం లేదని, శాశ్వత పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టాలని సమావేశం దష్టికి తీసుకువచ్చారు. ఇటీవల మున్నేరు వాగుకు అధిక వరద రావడంతో దెబ్బ తిన్న ఎర్త్ బండ్ బ్రిచ్చెస్ పూడ్చే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, బుడమేరు కాలువపై కొంతవంతెన నిర్మాణాపు పనులను త్వరితగతిన చేపట్టాలని సభ్యులు సమావేశం దష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ. టి.జె.హెచ్. ప్రసాద్ బాబు, పులిచింతల ప్రాజెక్ట్ ఎస్ఇ. శ్రీరామకష్ణ, కెసి డివిజన్ ఇఇ కష్ణారావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మంగమ్మ, సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల దీక్షలు

ప్రజాశక్తి - విజయవాడ : తపాల శాఖ జిడిఎస్‌పి జెసిఎ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా మంగళవారం ఒక్కరోజు నిరాహార దీక్ష జరిగింది. దీనిలో భాగంగా విజయవాడ కష్ణలంకలోని సిపిఎంజి ఆఫీసు వద్ద దీక్షలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 23 డివిజన్ల్, 12 బ్రాంచిల నుండి దాదాపు 600 మంది గ్రామీణ డాగ్ సేవ సభ్యులు హాజరయ్యారు. వై.మర్రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ యోగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ హాజరై గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. గ్రామీణ తపాల ఉద్యోగులను డిపార్ట్మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కె మీరావలి, కష్ణ యాదవ్, జమాల్ బాషా, ప్రభాకర్, నారాయణ, రాఘవేంద్ర, హేమలత తదితరులు ప్రసగించారు.

అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల పత్రాలు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : అటవీ హక్కుల చట్ట నిబంధనలను పరిశీలించి గిరిజనుల పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మగళవారం ఆయన అటవీ హక్కుల చట్ట 2006 (ఆర్‌ఓఎఫ్‌ఆర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలం అన్నరావుపేట గ్రామానికి చెందిన ఎనిమిది మంది గిరిజనులు 11.40 ఎకరాలకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. నిబంధనలు పరిశీలించి అర్హత మేరకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి అప్పన్న, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి యం.రుక్మాంగదయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సోషల్ వర్కర్ సభ్యుల నియామకానికి దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - విజయవాడ : బాలల సంక్షేమ సమితుల, బాలల న్యాయ మండలుల సభ్యుల నియామకానికి దరఖాస్తుల గడువును అక్టోబర్ 3వ తేదీ వరకూ పొడిగించినట్లు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు బి.డి.వి. ప్రసాద మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బాలల రక్షణ సంరక్షణ చట్టం 2015 / సవరించబడిన చట్టం 2021 ప్రకారం కొత్తగా ఏర్పడిన జిల్లాలతోపాటు మచిలీపట్నం కేంద్రంగా ఏర్పడిన కష్ణా జిల్లాలో, చిత్తూర్ కేంద్రంగా ఏర్పడిన చిత్తూర్ జిల్లాలో కొత్త చైల్డ్ వెల్ఫేర్ కమిటీలను జువెనైల్ జస్టిస్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 35 నుండి 65 సంవత్సరాల వయస్సు కలిగి పిల్లల సేవలో అనుభవంతోపాటు ఇతర అర్హత గల, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత ప్రొఫార్మాలో వారి క్రెడెన్సియల్ కాపీలతో 3వ తేదీలోపు విజయవాడలోని సంచాలకులు వారి కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని కోరారు. దరఖాస్తు ఫారం విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాలను http://wdcw.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ కాలమ్ నుండి దరఖాస్తు చేయబడే అభ్యర్థులు పొందవచ్చని తెలిపారు. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలని కోరారు. ఇ మెయిల్ ద్వారా పంపిన, అసంపూర్తి దరఖాస్తులు అంగీకరించబోమని తెలిపారు. అభ్యర్థులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీల్లో చైర్‌పర్సన్లు, మెంబర్లు, జువెనైల్ జస్టిస్ బోర్డులో సోషల్ వర్కర్ మెంబర్లుగా సేవలు అందించుటకు దరఖాస్తులను సమర్పించాలని ప్రసాద మూర్తి కోరారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

జిల్లా మాతా శిశు సంక్షేమాధికారి ఉమాదేవి

ప్రజాశక్తి-విజయవాడ : తల్లిపాలు విశిష్టత, ఆవశ్యకతపై మహిళలను చైతన్య పరుస్తూ జిల్లాలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా మాతా శిశు సంక్షేమ అధికారి జి. ఉమాదేవి తెలిపారు. రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలలో భాగంగా నగరంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో పోషణ మహోత్సవాల కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఉమాదేవి మాట్లడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డపుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని కోరారు. అనుబంధ పోషకాహారం మైన కూరగాయలు, చిరు ధాన్యాల వినియోగించాలని కోరారు ఈ .కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ జీ.మంగమ్మ, సూపర్వైజర్ ఎస్.కే రెహానా బేగం, సెయింట్ జాన్సన్ పాఠశాల హెచ్ ఎమ్ సిస్టర్ కపా, విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఓటర్ల పునఃపరిశీలన పూర్తి : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : స్పెషల్ సమ్మర్ రివిజన్లో భాగంగా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నూరు శాతం పునఃపరిశీలన పూర్తి చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు వివరించారు. సచివాలయంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి మంగళవారం స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024 లో భాగంగా ఇంటింటి పరిశీలన (హౌస్ టు హౌస్ వెరిఫికేషన్), మరణించిన, నకిలీ ఎంట్రీలపై ఫిర్యాదులు, ఎపిక్స్ జనరేషన్, తదితర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, ఇంచార్జి డిఆర్‌ఓ జి. వెంకటేశ్వర్లు , ఈఆర్‌ఓలు, వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన అనంతరం పునఃపరిశీలన పూర్తి చేసినట్లు చెప్పారు. ఈఆర్‌ఓలు, ప్రత్యేక అధికారులు, ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓలు అన్ని క్లెయిమ్స్ పునఃపరిశీలన చేశారని తెలిపారు.

మొబైల్ కోర్టులో జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి వి. విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం సర్కిల్-2 ఆఫీసులో మొబైల్ కోర్టు నిర్వహించారు. సర్కిల్-2 పరిధిలో నిబంధనలు ఉల్లంఘించిన 18 మందిపై మొబైల్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. వీరి నుండి రూ.4,350 అపరాధ రుసుము కింద వసూలు చేశారు. మరోసారి నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం : దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : పర్యావరణ పరిరక్షణకు విత్తనాలతో కూడిన మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని విజయవాడ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. వీటిని నిమజ్జనం చేసిన తర్వాత మొక్కలు మొలుస్తాయని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ఎన్జీవోలు, నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. వినాయకుడి ప్రతిమను మట్టితో ఎలా చేయాలి అన్న దానిపై విజయవాడ నగరపాలక సంస్థ వారు ఒక వీడియో ద్వారా చూపుతూ దాన్ని సోషల్ మీడియాలో రిలీజ్ చేస్తామని తెలిపారు.

ఎంకె బేగ్ స్కూల్‌ను పరిశీలించిన ఎంఇఓ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ నార్త్ ఎంఇఓ - 2 బి.వెంకటేశ్వర్లు మంగళవారం నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ ఎంకె బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌ను సందర్శించారు. ఎండిఎం, నాడు నేడు, విద్యా విషయ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. టీచర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి చైల్డ్ ఇన్ఫో, జెవికె కిట్స్ థంబ్, డ్రాపవుట్స్, విద్యార్థుల హాజరు తదితర అంశాలను అమలు పరచే విధానాలను విశదీకరించారు. పాఠశాలకు ఎంఇఓ హోదాలో మొదటిసారిగా వచ్చిన ఆయనను హెచ్‌ఎం ఎంఎస్.ఇమామ్ బాషా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి ఆషా లత, ఉపాధ్యాయులు డి.పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.

ఎంఇఓను సత్కరిస్తున్న హెచ్‌ఎం ఎంఎస్.ఇమామ్ బాషా

దస్తావేజు డాక్యుమెంట్ పోయినవి

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ పట్టణ కాపురస్థురాలు కాసరగడ్డ మోహన్ రావు భార్య కాసరగడ్డ కృష్ణకుమారి కు చెందిన పట్టాదారు పాస్ పుస్తకం భూమి యాజమాన్య హక్కు పత్రం రెండు కలిసి ఉన్న పట్టాదారు పాస్ పుస్తకం, దస్తావేజు నెం 4321/2021 పోయినవి . పట్టాదారు పాస్ పుస్తకం ఖాతా నెం.1021. చందర్లపాడు మండలం పోపూరు గ్రామం నెం. సర్వే నెం. 50-1A/1 0-28 , 50.1C/1 . 1-70 సెంట్లు. ఈ పాస్ పుస్తకమును గాంధీ సెంటర్ లో జిరాక్స్ నిమిత్తము చందాపురం రోడ్డులోని మా ఇంటి నుంచి బైక్ పై వెళ్తుండగా మార్గ మద్యలో కవర్లో నుండి జారి పోయినవి. సదరు దస్తావేజు డాక్యుమెంట్ దొరికిన వారు 9381259688 సెల్ నెంబర్ కి ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు మరియు తమిళనాడు రాష్ట్రం, చెన్నై, జార్జిటౌన్, అపోలో హాస్పిటల్ సిటీ బ్రాంచి, నెట్టు పిల్లియార్ కోయిల్ స్ట్రీట్, పాత నెం.11, కొత్త నెం. 23 కాపురస్తులు వి.యస్.ఆర్. ఆంజనేయ చౌదరి గారి వేగుంట వెంకట రాజేంద్ర ప్రసాద్ అనువారు నాకు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా :

నా క్లయింటు ది. 22-08-2023వ తేదీన ఉయ్యూరు నగర పంచాయతీ ఏరియాలోని సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం. 3210/2011రు పై ఇ.సి. దాఖలు చేసి, తిరిగి వెళ్లుచుండగా సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నుండి కాటూరు రోడ్డులో పై తెలిపిన విక్రయ దస్తావేజు నెం. 3210/2011 యొక్క ఒరిజినల్ ఎక్కడో జారిపోయినది. నా క్లయింటు మరలా వెనకకు వెళ్లి చూసినప్పటికీ దొరకలేదు. కావున సదరు విక్రయ దస్తావేజు నెం. 3210/2011రు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింద తెలిపిన నా అడ్రస్సుకు తెచ్చి ఇవ్వవలసినదిగా తెలియ జేయడమైనది.

ఉయ్యూరు
ది.12-9-2023

ఇట్లు
కోడూరు నాగేశ్వరరావు,
అడ్వకేట్ మరియు నోటరీ,
లక్ష్మీటాకీస్ బజారు,
ఉయ్యూరు-521 165.
సెల్ : 93935 78444

మహారాజశ్రీ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు, నూజివీడు
ఎస్.ఓ.పి. నెం. 3/2023

బిట్వీన్
షేక్ రమీజున్నీసా అండ్ 4 ఇతరులు...పిటీషనర్స్
నిల్ ... రెస్పాండెంట్లు

పై నెంబరు దావా నందు సక్సెషన్ సర్టిఫికెట్ కొరకు పిటీషనర్లు అయిన 1) షేక్ రమీజున్నీసా భర్త: రియాజుద్దీన్ 2) మహమ్మద్ జిలానీ తండ్రి : లేటు జక్రరయ్య 3) మహమ్మద్ ఫిర్దోస్ భర్త : లేటు ఈసా 4) మహమ్మద్ ఇలియాస్ తండ్రి : లేటు ఈసా 5) మహమ్మద్ ఫరోహ్నా తండ్రి : లేటు ఈసా అను వారలు కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామ కాపురస్తులు పై పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనర్లు 1, 2 వార్లకు తండ్రిగార్ను, 3 వారికి మామయ్య గార్ను, 4, 5 వార్లకు తాతగారైన శ్రీ మహమ్మద్ జక్రరయ్య ది. 31-12-2020న ఇంటెస్టేట్‌గా పరమపదించినారు. కావున సదరు మహమ్మద్ జక్రరయ్య గార్కి పైన తెలిపిన వార్లు మాత్రమే "క్లాస్ వన్ హెయిర్స్"గా అయివున్నారు. కాబట్టి పై కోర్టు నందు సక్సెషన్ సర్టిఫికెట్ పొందు నిమిత్తం గాను ఎవరికైనను ఏ విధమైన అభ్యంతరములు గాని, హక్కులు గాని ఉన్న యెడల ది. 30-10-2023వ తేదీన వాయిదాకు స్వయంగా గానీ, లేక ప్లీడరుగారి ద్వారా గానీ ఏవైనా ఆక్షేపణలు తెలియపరచవలెనని కోరటమైనది. లేనియెడల పిటీసనర్లు పరోక్షమున దావా తీర్మానించబడునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతితో)

నూజివీడు
తేది: 13-9-2023

శ్రీ ఊసా జయప్రసాద్,
అడ్వకేట్ అండ్ నోటరీ,
హనుమాన్ జంక్షన్ - 521105
సెల్ : 8106787967

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టులో
EA 5/2019 EA 6/2019
EP 141/2016 OS 281/2015

Between :
షేక్ ఇబ్రహీం ఖలీలుల్లా, రిప్ బై స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ మరియు సిగ్నటరీ షేక్ హిదయతుల్లా రెహమాన్ మరియు వగైరాలు... పిటీషనర్స్ / క్లైమెంట్స్
అండ్
చాగర్లమూడి శ్రీనివాసరావు మరియు వగైరాలు
.... రెస్పాండెంట్స్ / డిహెచ్ఆర్.

R3 : చింతలపాటి గోపాలకృష్ణ శర్మ తండ్రి శ్రీరామమూర్తి
R4 : చింతలపాటి ఆదిలక్ష్మి భర్త శ్రీ రామమూర్తి
R5 : కోటమర్తి సువర్చల, భర్త: సుధాకరశర్మ
ఫ్లాట్ నెం.4, 1వ అంతస్తు, సత్య అపార్ట్‌మెంట్స్, రాములవారి వీధి, మారుతీనగర్, విజయవాడ నగరం, ఎన్‌టిఆర్ జిల్లా.

పై కోర్టులో పై నెంబరు ఇ.పి.లోని షెడ్యూల్ ఆస్తికి సంబంధించి క్లెయిమ్ కోరుచూ పిటీషన్ దాఖలు చేసి ఉన్నాము. సదరు పిటీషన్‌లో షేక్ ఇబ్రహీం ఖలీలుల్లా గారి తరపున వారు నాకు జి.పి.ఎ. ఇచ్చియున్నారు. దానికి సంబంధించి IA 5/19 నెంబరు గల పిటీషన్ దాఖలు చేసి R3 to R5 రెస్పాండెంటులకు కోర్టు ద్వారా చాలా పర్యాయములు నోటీసులు పంపగా సదరు రెస్పాండెంట్లు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం ది. 25-9-2023నకు వాయిదా వేసియున్నారు. కావున ది. 25-9-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో మీరు గాని, మీ తరపున లాయరుగారు గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించగలరు.

ఇట్లు
శ్రీ మట్టుపల్లి వెంకటసుబ్బారావు,
క్లైమ్ పిటీషనరు తరపు న్యాయవాది,
గుంటూరు.

Skill AP
APSSDC

స్కిల్ కళాశాల ఇక లేనట్లేనా?

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కళాశాల (స్కిల్ కాలేజ్ రెసిడెన్షియల్) ఏర్పాటు విషయంలో ఒక అడుగు కూడా ముందుకు పడలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా స్కిల్ కాలేజ్ ఏర్పాటు మిగిలిపోయింది. ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటమేనని బందరులో స్కిల్ కాలేజి ఏర్పాటు ఇక లేనట్లేనని ప్రచారం సాగుతోంది. యువత భవిష్యత్తుకు భరోసాగా నిలిచేలా స్కిల్ కాలేజీ సర్వహంగులతో కల్పిస్తామని అధికారులు ఒకప్పుడు వూదర గొట్టారు. అధికారులు కేవలం ప్రచార ఆర్భాటం చేసి కాలం గడిపేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మచిలీపట్నం నగర శివారు, చల్లపల్లి వైపు బైపాస్ రోడ్డులో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటన చేశారు. టిడిపి ప్రభుత్వంలో ఇదే భూమిని స్టేడియం ఏర్పాటుకు కేటాయించిన విషయం విధితమే. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థలం నైపుణ్య శిక్షణ సంస్థకు అప్పగించే దానిలో భాగంగా అప్పటి జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని అధికారులు చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే కాలేజీ నిర్వహణకు అనుగుణంగా అధునాతనమైన భవన నిర్మాణాలు చేస్తామని అప్పట్లో ఉన్నతాధికారులు వెల్లడించారు. అయితే భవన నిర్మాణం సంగతి పక్కన పెడితే ఇప్పటి వరకు స్థలం కేటాయింపులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని తెలుస్తుంది. కేవలం మినీ, మెగా జాబ్ మేళాలతో నిరుద్యోగుల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తూ జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ కాలం గడుపుతోంది. కాగా కొంత కాలం క్రితం నిమ్మకూరులో స్కిల్ కాలేజికి కావలసిన రెసిడెన్షియల్ సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో మహిళలకు బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతులను తూతూ మంత్రంగా నిర్వహించారు. ఆ తర్వాత అభ్యర్థులను మొబిలయిజ్ చేసే పని సంస్థ నిర్వహిస్తూ కొన్ని ట్రేడ్లలో శిక్షణ కొరకు నున్నలో ఉన్న ప్రైవేట్ కళాశాలైన వికాస్ కాలేజికి అప్పచెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ కళాశాలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తే ప్రభుత్వం కేటాయించే నిధులు ఉపయోగించుకుని మిగులు నిధులు మౌలిక సదుపాయాల కల్పనకు దోహదం చేస్తాయి. అది మరిచి ప్రైవేట్ కళాశాలకు ప్రభుత్వం నిధులు ధారాదత్తం చేస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా శిక్షణ ఇచ్చేందుకు కష్ణాజిల్లాలో అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలలో స్కిల్ హబ్లు (నైపుణ్య శిక్షణ కేంద్రాలు) ఏర్పాటు చేశారు. జిల్లాలో మారుమూల ఉన్న గ్రామీణ ప్రాంత యువతకు కూడా అందుబాటులో ఉండేలా ఇటువంటి ఏర్పాట్లు చేశారు. ఆయా చోట్ల కొన్ని రకాల వత్తిపర ట్రేడ్లలో శిక్షణ ఇస్తూ కసరత్తు చేస్తున్నారు. ఆయా కేంద్రాలలో కంప్యూటర్ శిక్షణకు అవసరమైన కంప్యూటర్లు, లాప్ టాప్ లు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. దాంతో గతంలో స్థానిక కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఎంప్లాయిమెంట్ స్కిల్ సెంటర్లకు అందించిన కంప్యూటర్లను దారి మళ్లించి శిక్షణా కేంద్రాలలో సర్దు బాటు చేసి విద్యార్థుల శిక్షణ పూర్తి చేశారు. అధికారులు ఇక్కడే అసలైన ట్విస్ట్ ఇచ్చారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వం నుండి జారీ అయిన పాస్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా తాత్సర్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. అంతేకాక విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రభుత్వం శిక్షణ కాలంలో స్టైఫెండ్ కూడా ఇస్తుందని నమ్మపలికి బురిడీ కొట్టిస్తున్నారు. ఇకనైనా బందరులో నైపుణ్య శిక్షణా కళాశాల ఏర్పాటు చేయాలని, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లు జారీకి చర్యలు తీసుకోవాలని, నైపుణ్యాభివద్ధి సంస్థ యువతకు భరోసాగా నిలిచేలా జిల్లా కలెక్టర్ రాజాబాబు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మచిలీపట్నంలో కాగడాల ప్రదర్శన

కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి అనుబంధ సంఘాల అధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా కక్ష సాధింపుతోనే కుట్ర చేశారన్నారు. సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రతిపక్షాలపై కక్ష సాధింపులే లక్ష్యంగా జగన్ పని చేస్తున్నారని విమర్శించారు. పేద విద్యార్థుల కోసం చంద్రబాబు ఎన్నో విద్యాసంస్థలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. జగన్ చేసే కుట్రలన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లంకి శెట్టి నీరజ, పట్టణ అధ్యక్షురాలు వసంతకుమారి, తెలుగు యువత అధ్యక్షుడు సలీం, జిల్లా అధికార ప్రతినిధిలు కట్టా దుర్గా, పాలపర్తి పద్మ, పట్టణ యువత అధ్యక్షుడు పిన్నిటి అయ్యప్ప, రైతు నాయకులు పామర్తి లక్ష్మణ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు:** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఉయ్యూరు టిడిపి కార్యాలయంలో నాయకులు నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి లండన్ పర్యటనకు వెళుతూ చంద్రబాబు అక్రమ ఆరెస్టుకు స్కెచ్ గీసి వెళ్లారని, అరెస్టు, రిమాండ్కు పంపిన తరువాత అక్కడ నుండి తిరిగి రావడం క్షక్ష సాధింపు చర్యలో భాగమే అన్నది ప్రజలు అర్థం చేసుకున్నారని పట్టణ పార్టీ అధ్య క్షుడు జంపాన గుర్నాధరావు, మాజీ చైర్మన్ ఖుద్దూస్, మాజీ ఎంపీటీసీ మండవ జయ దేవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు నజీర్, మాజీ ఎంపీటీసీ రఫీ, నరేశ్, చిరంజీవి, అంజిబాబు పాల్గొన్నారు.

కుట్రపూరితంగానే చంద్రబాబుపై కేసు : మండలి

ప్రజాశక్తి-మోపిదేవి: చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కేసు పూర్తిగా అవాస్తవమని గట్టిగా చెప్పవచ్చునని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు చంద్రబాబు కోసం మంగళవారం టిడిపి నాయకులు మోపిదేవి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నైపుణ్య అభివద్ధి సంస్థ నుంచి సొమ్ము చంద్రబాబుకు ఎలా చేరిందో ఇప్పటివరకు సిఐడి అధికారులు నిరూపించలేకపోయారన్నారు జగన్ అవినీతి కేసుల్లో అవినీతి సొమ్ము ఏ ఖాతా నుంచి ఏ ఖాతాలోకి వెళ్లిందో స్పష్టంగా ఆధారాలు బయటకు వచ్చాయన్నారు. చంద్రబాబు లోకేష్ సభలకు వేలాదిగా ప్రజలు రావడం గమనించిన జగన్ ఆధారులు లేని కేసులో చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి నేరపూరిత మనస్తత్వం అన్నారు. కుటిల నైజంతో చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. నిజంగా అవినీతి జరిగితే నైపుణ్య అభివద్ధి సంస్థ అధికారులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. జగన్ పరిపాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లి అదోగతి పాలయ్యిందన్నారు. చంద్రబాబు తెచ్చిన పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన జగన్ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని బుద్ధ ప్రసాద్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, తెలుగు మహిళా నాయకులు పైడిపాముల కృష్ణకుమారి, నిడమనూరు దిలీప్ తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్:** మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ నాయకులు మంగళవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుల్తానగరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు జవ్వారుపేటలోని టెక్కాలో ప్రార్థనలు, పోలీస్ లైన్ ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, గొర్రిపాటి గోపిచంద్, గోపు సత్యనారాయణ, ఇలియాస్ పాషా, కాగిత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్:** హనుమాన్ జంక్షన్లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొంతు చిన్న, పాపారావు, యనమదల వెంకారావు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** అవనిగడ్డలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే కనకదుర్గ, మాచవరపు ఆదినారాయణ, ఘంటసాల రాజమోహనరావు పాల్గొన్నారు.

15న తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ

నూతనంగా నిర్మించిన తహశీల్దార్ కార్యాలయాన్ని ఈనెల 15వ తేదీన ప్రారంభిస్తున్నట్లు తాసిల్దార్ ఎల్వీఎస్ రామకృష్ణ తెలిపారు. బ్రిటిష్ వారు నిర్మించిన తాసిల్దార్ కార్యాలయం దెబ్బతినడంతో దాని స్థానంలో నూతన భవనాన్ని పూర్తి చేసి నాలుగేళ్లు అయినా ప్రారంభానికి నోచుకోలేదు. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ క్రమంలో ఎట్టకేలకు శుక్రవారం భవనం ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

200 మందికి అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

హనుమాన్ జంక్షన్లో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం 200 మందికి అన్న ప్రసాదం వితరణ జరిగినది. ఈ అన్న ప్రసాద వితరణకు ఏపూరుకు చెందిన వామరాజు వెంకట నరింహారావు దంపతులు సహకరించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ నెర్సు భూషణం దాతలను సన్మానించారు.

విఎన్పురంలో సమస్యలు తిష్ట

ప్రజాశక్తి-గన్నవరం: 21 ఏళ్ల క్రితం ప్రభుత్వం గన్నవరం మండలం వెంకటనరసింహాపురంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. లబ్దిదారుల్లో కొందరు కుటుంబ పరిస్థితుల రీత్యా స్థలాలు వేరొకరికి అమ్ముకున్నారు. అందరూ కష్టపడి సొంతిళ్లు కట్టుకున్నారు. గన్నవరం పట్టణానికి కూ తవేటు దూరంలో ఉండటంతో సొంతింటితో నిలువ నీడ దొరికిందని వారంతా సంబరపడ్డారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించకపోయినా అద్దెల దరువు నుంచి తప్పించుకునేందుకు పేదలు చాలా మంది వాటిల్లో ఉంటున్నారు. స్థలాలు ఇచ్చాం.. మీ తిప్పలు మీరు వదమని ప్రభుత్వం వదిలేసింది. దీంతో నివాశితులకు కష్టాలు మొదలయ్యాయి. చినుకు పడితే రోడ్లన్నీ నీటితో మునిగిపోతున్నాయి. ఇళ్ల పరిస్థితి అదేలా తయారైంది. మురుగు నీరంతా ఖాళీ స్థలాల్లోకి చేరి దోమలకు కేంద్రాలుగా మారాయి. మట్టి రోడ్లు బురదగా మారి జనాలకు ఇబ్బందులు పంచుతున్నాయి. మంచినీరు తాగడానికి లేక టిన్నులతో కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల పంచాయతీ సర్పంచ్. అధికారులు కలిసి కొన్ని గ్రావెల్ రోడ్లు వేశారు. మిగిలిన అంతర్గత రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. పల్లపు ప్రాంతాల్లో ఉంటున్న వారు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎక్కడా డ్రెయినేజీ లేదు. ఇళ్లలో వాడిన మురుగంతా రోడ్లపైకే వస్తుంది. దీ ంతో వందులు స్వైర విహారం చేసి నాశనం చేస్తున్నాయి. రాత్రైతే దోమలు ఇళ్లలోకి వస్తున్నాయి. విషజర్వాలు పంచుతున్నాయి. పంచాయతీలోనిధులు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు.

నీట మునిగిన ఖాళీ స్థలం

నీటి సరఫరా చేసి సరిపెడుతున్నారు. గుర్తొచ్చినపుడు వీధి లైట్లు వేస్తు న్నారనే వాదనుంది. మూడు వేల కుంటుంబాలు రోజూ అవస్థలు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోజూ నానా కష్టాలు పడుతున్నాం : శివాజీ

ఇళ్ల మధ్యలో మురుగు ఉండటంతో దోమలు వద్ధి చెంది నిద్ర లేకుండా చేస్తున్నాయి. జ్వరాలు ప్రబలడంతో ఇంటికో వ్యక్తి ఇబ్బంది వడుతున్నాడు. మట్టి రోడ్లు చితడిగా మారి జనాలను కష్టాలకు గురి చేస్తున్నాయి.

మా బాధలు ఎవ్వరికీ పట్టడంలేదు : అప్పారావు

మౌళిక సదుపాయాలు లేకపోవడంతో జనాలు వడుతున్న బాధలు ఎవ్వరికీ పట్టం లేదు. వర్షం పడిందంటే కష్టాలు మొదలవుతాయి. రాత్రిళ్లు పాముల సంచారం అధికంగా ఉంటుంది. పారిశుధ్య పనులు చేయించే అధికారి లేరు. ఆర్వో ప్లాంటు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. మంచినీటి కోసం కిలో మీటర్లు పోవాల్సి వస్తుంది. గన్నవరం నుంచి మంచినీరు తీసుకువచ్చి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తున్న అధికారులు

గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: ఈనెల 14వ తేదీన రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు అన్ని ఏర్పాట్లు సజావుగా చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం మచిలీపట్నం మండలం రుద్రవరంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి తో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాకులోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియం, గ్రీన్ రూమును పరిశీలించారు. అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలన భవనంలోని సెనేట్ హాలులో డిఆర్ఓ ఉపకులపతితో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన రాష్ట్ర గవర్నర్ కష్ణా విశ్వవిద్యాలయంలో గాడి చర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాడిచర్ల అవార్డు ప్రధాన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.ఆ రోజున ఉదయం 9:45 గంటలకు విజయవాడ రాజ్ భవన్ నుండి బయలుదేరి విశ్వవిద్యాలయానికి 10.45 గంటలకు చేరుకుంటారన్నారు. అనంతరం కాసేపు విశ్రాంతి తీసుకుని ఉదయం 11 గంటలకు సభా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గవర్నర్ వాహన శ్రేణి (కాన్వాయ్) ప్రయాణించే మార్గంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సజావుగా చేయాలన్నారు. గవర్నర్ పర్యటనకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. కాన్వాయ్ లోను, కార్యక్రమం జరిగే విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనూ అగ్నిమాపక వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ వాహన శ్రేణి వచ్చే మార్గం,విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎలాంటి చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే రహదారుల్లో గుంతలు లేకుండా సరిచేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు నిపుణులైన వైద్యులు సిద్ధంగా ఉండాలన్నారు. సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సదుపాయంతో ఒక గదిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ నాగేశ్వర్ నాయక్, డిటిసి సీతాపతి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వీర బ్రహ్మాచారి, మునిసిపల్ సహాయ కమిషనర్ జ్యోతి, విద్యుత్ శాఖ అధికారి భాస్కరరావు, విపత్తు అగ్నిమాపక నిర్వహణ అధికారి ఏసురత్నం, డిఎంహెచ్వో డాక్టర్ గీతాబాయి, డీఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

వర్షపు నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ప్రసాద్‌నగర్ 22వ వార్డులో ఉన్న వర్షపు నీటిని బయటికి పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వసంతకు స్థానిక ప్రజలు వినతిపత్రం అందజేశారు. ప్రసాద్ నగర్ వాసులు గత 2 నెలల నుంచి వర్షపు నీరు నిలవడంతో పాములు, మురుగు నీరు తీవ్ర వాసనా, దోమలు వల్ల చిన్న పిల్లలు, మహిళలు, వద్దులు రోగులు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే వసంతకు సిపిఎం మండల కార్యదర్శి ఎం.మహేష్, నాయకులు ఎ.విఠల్‌రావు, జాకీర్ హుస్సేన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్‌కె మహ బాషా, ప్రసాద్ నగర్ వాసులు బాల మురళీ, కృష్ణ కుమారి తదితరులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సత్వరమే వర్షపు నీరు బయటికి పంపేందుకు చర్యలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కొమరగిరి ట్రస్ట్, గాయత్రి బ్రాహ్మణ సంఘం, చిన్నఅవుటుపల్లి పిన్నమనేని సిద్ధార్ధ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గాయత్రి కళ్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో ఆరుగురికి కంటి ఆపరేషన్ నిమిత్తం రిఫర్ చేశారు. వారిని పిన్నమనేని సిద్ధార్ధ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక బస్‌లో పంపించారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి ట్రస్ట్ చైర్మన్, గాయత్రి బ్రాహ్మణ సంఘం కన్వీనర్ కొమరగిరి భరద్వాజ్, గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కలవకొను వీర ఆంజనేయ శర్మ, కార్యదర్శి మాడపాటి కిషోర్, మహిళా సంఘం అధ్యక్షులు కొడాలి అపర్ణ, సభ్యులు లావణ్య, శ్రీనివాస్, పి ఆర్ ఓ రాఘవ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జిల్లాలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను విజయ వంతంగా నిర్వ హిస్తున్నామని తల్లిపాల విశిష్టత ఆవశ్యకతపై మహిళలను చైతన్యం తులను చేస్తున్నట్లు .. జిల్లా మాతా శిశు సంక్షేమ అధికారి జి. ఉమాదేవి తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా నగరంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించిన పోషణ మహోత్సవాల కార్యక్రమా నికి ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా బిడ్డపుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని ఆరునెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలని కనీసం రెండు సంవత్సరాల వరకు ఆహారంతో తల్లిపాలను కూడా కొనసాగించాల్సిన మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిడిఐసిడిఎస్ సి డి పి ఓ జి.మంగమ్మ సూపర్వైజర్ ఎస్.కె రెహానా బేగం సెయింట్ జాన్సన్ పాఠశాల హెచ్ ఎమ్ సిస్టర్ కృపా విద్యార్థినులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయాల్లో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని ధన శైల సీతారామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం దేవాదాయ శాఖ విచారణ చేపట్టింది. ఆలయ పునర్నిర్మాణ పనులు ఆస్తుల పరి రక్షణలో అవకతవకలు జరుగుతు న్నట్లు నమోదైన ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుపై లోకాయుక్త స్పందిస్తూ డిప్యూటీ కమిషనర్ విజయ రావును ఆదేశించిన మేర ఆయన విచారణ చేపటా రు. ఈవో సీతా రామయ్య సహ అర్చ కులు, సిబ్బంది, కార్మి కులను విచారిం చారు. కోటిలింగ హర హర క్షేత్రంలో కూడా అవకతవకలు ఉన్నాయని వచ్చిన ఫిర్యాదుపై ఈవో శిరీషతో సహా సిబ్బందిని విచారించారు.

విచారణ చేస్తున్న అధికారులు

ఆత్మహత్యల నివారణలో సమాజం పాత్ర కీలకం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : "ఆత్మహత్యల నివారణలో సమాజం పాత్ర కూడా ముఖ్యమైనదని, ఆత్మహత్యల సంఘటనల గురించి వివరణాత్మక వివరణలు కాకుండా సమస్యలకి అండగా ఉన్నట్లు భరోసా ఇవ్వడం అవసరం" అని ప్రముఖ సైకియాట్రిస్ట్, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా॥వి. రాధికారెడ్డి పేర్కొన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డా॥సమరం అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె "ఆత్మహత్యల నివారణ" అంశంపై ప్రసంగించారు. భారతదేశంలో సంవత్సరానికి లక్షమందికి పైగా ఆత్మహత్యలతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గత 3సంవత్సరాల్లో లక్ష జనాభాకి 10.2 ఆత్మహత్యలు జరగగా, ఇప్పుడు 11.3 ఆత్మహత్యలకి పెరిగాయన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, వెస్ట్ బెంగాల్‌లో ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్యలకి ప్రయత్నించే వాళ్ళ సంఖ్యలో మహిళలు ఎక్కువ ఉండగా, ఆత్మహత్యలతో ప్రాణాలు కోల్పోయేవాళ్ళు మాత్రం పురుషులే ఎక్కువన్నారు. వైవాహిక జీవితం గడుపుతున్న వారికంటే విడాకులు పుచ్చుకున్నవాళ్ళు, దంపతులు ఒకరికొకరు విడిపోయినవాళ్ళు ఆత్మహత్యలు చేసుకోవడం ఎక్కువన్నారు. అనారోగ్య కారణాలు, మానసిక వ్యాధులైన డిప్రెషన్, స్కిజోఫ్రినియా వంటి వ్యాధుల వల్ల కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆత్మహత్యలు చేసుకోవడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ వాటి నివారణ విషయంలో సమాజం శ్రద్ధ తీసుకుంటే చాలావరకు తగ్గిపోతాయన్నారు. డిప్రెషన్‌కు గురైన వారి మనస్తత్వాన్ని దగ్గరుండి చూసినవాళ్ళకి కొన్ని సంకేతాలందుతాయని, వాటిని గుర్తించి, నేనున్నానని అభయం వాళ్ళకి ఇవ్వగలిగితే ఆత్మహత్య చేసుకోవడం ఉండదన్నారు. డా॥మారు వందన సమర్పణ చేసారు

మాట్లాడుతున్న డాక్టర్ వి. రాధికా రెడ్డి

డాక్టర్ రెజీనా జీవితం మహిళలకు ఆదర్శప్రాయం

- సంతాప సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ తెలుగు అధ్యాపకులు డాక్టర్ రెజీనా జీవితం ఎంతో మంది మహిళలకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో స్టెల్లా కళాశాల తెలుగు రీడర్ డాక్టర్ రెజీనా సంస్మరణ సభ మంగళవారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మహిళలు పాల్గొని రెజీనా చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జన శిక్షణ సంస్థాన్‌చైర్మన్ డాక్టర్ నాగళ్ల విద్యాకన్నా మాట్లాడుతూ డాక్టర్ రెజీనా మరణం చాలా దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆమె జీవితం ఎంతో మంది మహిళలకు ఆదర్శప్రాయమని అన్నారు. బోధనాసుపత్రిలో ఉన్న వారికి ఆమె అనుసరించిన విధి విధానాలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ రెజీనా మేరిస్ స్టెల్లా కళాశాల నందు ఎన్నో ఏళ్ళుగా తెలుగు బోధనా ఉపాధ్యాయులుగా సేవలు చేయడమే కాకుండా, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వరకట్న సమస్యలు, అశ్లీలతకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపిన వారిలో ఒకరని అన్నారు. తరుణీ తరంగాలు నిర్వాహకురాలు వి.జ్యోత్స్న, డాక్టర్ రావి శారద మాట్లాడుతూ సమాజంలో ఎన్నో మహిళా సమస్యలు ఉన్నప్పటికీ ముందుకు వచ్చి పోరాడే మహిళలు అతి తక్కువ మంది ఉంటారన్నారు. ఐద్వా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ డాక్టర్ రెజీనా స్త్రీల సమస్యలపై పోరాడిన విధానాలు చిరకాలం గుర్తుండిపోతాయని అన్నారు. మహిళా సంఘం నాయకురాలు పి.దుర్గ భవానీ మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో రెజీనా లాంటి మనుషులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ఈకార్యక్రమంలో మహిళా సంఘం నేతలు జి.వాణి, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాకన్నా

ఎంబిబిఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట రూరల్: మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన అంబోజీ వెంకటేశ్వర్లు, సువర్ణ లత కుమార్తె అంబోజీ సింధూజ నీట్ పరీక్షల్లో సత్తా చాటి ఎంబీబీఎస్ సీటు సాధించింది. నీట్‌లో 720 మార్కులకు గానూ 442 మార్కులు సాధించి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. ఈ సందర్భంగా మల్కాపురం గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ అంబోజీ జాన్ ఆధ్వర్యంలో సింధూజను ఘనంగా సన్మానించారు. సింధూజ తండ్రి ఖమ్మం పట్టణంలో ట్యూషన్ పాయింట్ నడుపుతారు. పేద కుటుంబానికి చెందిన సింధూజ కష్ట పడి చదివి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ఫ్రీ సీట్ సాధించడం పట్ల గ్రామస్తులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంబోజీ జాన్ మాట్లాడుతూ కష్టపడి చదివితే ఫలితం దానంతట అదే వస్తుందని సింధూజ నిరూపించిందని, గ్రామంలోనే మొదటిగా ఎంబీబీఎస్ సీటు సాధించిన సింధుజాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంభోజీ చిన్న అక్కులు, నాగమ్మ, వంగూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాస్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - భవానీపురం : భారత ప్రభుత్వ అత్యున్నత కీర్తిచక్ర పురస్కార గ్రహీత, తెలుగుతేజం, బలహీన వర్గాల ఆశాజ్యోతి నిస్వార్థంగా సేవ చేసిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి పందిళ్ళపల్లి శ్రీనివాస్ సేవలు మరువలేనివని ఏపీ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం, ఎపి పిటిడి బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ.శేషగిరిరావు తెలిపారు. మంగళవారం భవానీపురంలోని ఏపీ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు టి.వి.రమణ ఆధ్వర్యంలో పందిళ్ళ పల్లి శ్రీనివాస్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ శేషగిరిరావు మాట్లాడుతూ తమిళనాడు కర్ణాటక కేరళ రాష్ట్రాలను గడగడలాడిస్తున్న స్మగ్లర్ వీరప్పన్‌ను అరెస్ట్ చేసిన ఏకైక అధికారి పందిళ్ళపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన మరణాంతరం కేంద్ర ప్రభుత్వం కీర్తి చక్ర పురస్కారాన్ని ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ యశోద, కృష్ణా జిల్లా చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షులు టి. పూర్ణయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ శేషగిరిరావు, యశోద

17 న గ్రీన్ స్కూల్లో చెస్ సెలక్షన్స్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 17వ తేదీన పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సహాయ సహకారాలతో కృష్ణా జిల్లా ర్యాంకింగ్ బాల.బాలికల చెస్ సెలక్షన్ జరుగుతాయని అసోసియేషన్ సెక్రటరీ యస్.ఎం.ఫణి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేవారు తప్పకుండా ఎపి చెస్ అసోసియేషన్‌లో తమ పేర్లను శనివారం రాత్రి 6 గంటలలోపు నమోదు చేసుకోవాలని అన్నారు. స్పాట్ ఎంట్రీలు ఉండవని తెలిపారు. ఈ టోర్నమెంట్ లో ప్రతి ఏజ్ గ్రూప్ బాలురు , బాలికల నుండి ఒక్కరిని సెలెక్ట్ చేస్తారని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో సెలెక్ట్ అయినవారు ఈ నెల 24న శ్రీకాకుళంలో జరిగే స్టేట్ లెవెల్ మన కృష్ణా జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలియచేశారు. మరిన్ని వివరాలకు 9700775220, లేదా 9247153387 నెంబర్‌లో సంప్రదించగలరని తెలియచేసారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి వెంకటరమణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకట రమణ కుటుంబ సభ్యులతో కలిసి మంగళ వారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికా రులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రోడ్డుపై పడిపోయిన వృద్ధుడు

రోడ్డుపై స్పృహతప్పిన గుర్తు తెలియని వృద్ధుడు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రోడ్డుపై ఓ గుర్తు తెలియని సుమారు (70) సంవత్సరాల వృద్ధుడు స్పృహ తప్పి పడిపోయిన సంఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో వన్‌టౌన్ తారాపేట కరీముల్లా పలావు హోటల్ పక్కన 70 సంవత్సరాల వృద్ధుడు స్పృహతప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్‌లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. వ్యక్తి పేరు, ఊరు వివరాలు తెలియదని, ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ 9440627076, 0866-2568220 ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

రక్షణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడి భక్తుల రక్షణకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జనసేనపార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఘాట్ రోడ్డు వద్ద గల కేశఖండన శాల వద్ద కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని ఆయన జనసైనికులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పోతిన మహేష్ మాట్లాడుతూ నెలరోజుల క్రితం కూడా ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడితే నెట్ వెయ్యాలి, రక్షణ చర్యలు తీసుకోవాలని మేము చెప్పినా కూడా ఈవో, చైర్మన్ ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు వీలాక్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.